
# మీ రంగురంగుల పులుల పాలనలో ప్రజలకు భద్రత ఎంతుంది ముఖ్యమంత్రి గారూ!




రాష్ట్ర ముఖ్యమంత్రి
చంద్రబాబు నాయుడు గారికి,

అన్నిటికీ ప్రజల దగ్గరకు పోతాననీ ప్రజల అభిప్రాయాన్ని మన్నిస్తాననీ ప్రజల మెచ్చుకోలే మీకు కావాలనీ మీరు అంటుంటారు కాబట్టి ప్రజల హక్కుల కోసం రెండు దశాబ్దాలకు పైగా పనిచేస్తున్న సంస్థగా మీకు ఈ ఉత్తరం రాస్తున్నాం.

ఈ మధ్య రాష్ట్రంలోకి ప్రవేశించిన గ్రీన్‌టైగర్ల గురించి, బ్లాక్ టైగర్ల గురించి మీరు వినే వుంటారు. పత్రికలు చదవకపోయినా మీ డిజిపి గారు మీకు చెప్పే వుంటారు. పులుల గొడవ ముఖ్యమంత్రికి ఎందుకులే అని వారు ఒకవేళ చెప్పకపోయినా రెండురకాల పులుల గురించి రెండు రిట్‌పిటిషన్లు విచారణకు స్వీకరించిన హైకోర్టు మీకు జారీ చేసిన నోటీసులు చదివే వుంటారు. ఆ విధంగా తెలిసే వుంటుంది.

పులులు మామూలుగా పసుపుపచ్చ రంగులో వుంటాయి. అంటే మీ పార్టీ రంగని చెప్పడం మా ఉద్దేశ్యం కాదు లెండి. అది వాటి ప్రకృతి సిద్ధమైన రంగు. ఆపైన నల్లటి చుక్కలూ చారలూ వుంటాయి. ఈ పులులు ఆకుపచ్చవీ నల్లవీ. ఇంకా ఏయే రంగుల పులులు రానున్నాయో తెలీదు. మన రాష్ట్ర సరిహద్దు దగ్గర బొత్తిగా కాపలా లేనట్టుంది. పులులు మామూలుగా గోళ్లతోనూ, పళ్లతోనూ చంపుతాయి. ఈ పులులు తుపాకులతో, ఇనుపరాడ్లతో, వేట కొడవళ్లతో చంపుతున్నాయి. ఇదేం వింతో.

పులులు మామూలుగా ప్రెస్‌కాన్ఫరెన్సులు పెట్టవు (మాకు తెలిసి). మేము పెడతాము, మీరు పెడతారు. కానీ ఈ పులులు ప్రెస్‌కాన్ఫరెన్సులు పెడుతున్నాయి. పత్రికా ప్రకటనలు విడుదల చేస్తున్నాయి. గోడలకు పోస్టర్లు అంటిస్తున్నాయి.

పులులు మామూలుగా మాటువేసి దాడిచేసి చంపుతాయి. ఈ పులులు 'వాడ్ని చంపుతాం', 'వీడ్ని చంపుతాం' అని ముందే ప్రకటనలు జారీ చేస్తున్నాయి. పులులు మామూలుగా బొద్దుగా, బలంగా వుండేవాళ్లను చంపుతాయి. కండమాంసాలు పుష్టిగా వున్నవాళ్లను చంపుతాయి. ఈ పులులకు ఆ పట్టింపు లేనట్టుంది. పౌరహక్కుల వాళ్లను, ప్రజా కళాకారులనూ, నక్సలైట్ల సానుభూతిపరులనూ, పోలీసుల చర్యలను విమర్శించే ప్రజా ప్రతినిధులనూ ఈ పులులు తమ శత్రువులుగా ఎంచుకున్నాయి. ఎందుకో మరి.

చూడగా చూడగా ఇవి పులులు కావనీ, మనుషులేననీ ప్రజలకు అనుమానం వస్తున్నది. అందులోనూ పౌరహక్కుల వాళ్లంటే ఈ పులులకుండే ద్వేషాన్ని బట్టి ఇవి పోలీసు జాతివో లేకపోతే పోలీసులు సృష్టించినవో అయివుండాలని అనుమానం వస్తున్నది. రానురాను




అది నమ్మకమవుతున్నది. కీర్తిశేషులు మీ మామగారు చాలా ఏళ్లకింద హత్యచేసే కళలో సుశిక్షితులయిన పోలీసులకు వేట కుక్కల జాతి అయిన (గ్రేహౌండ్స్) పేరు పెట్టారు. మీరు వారికంటె అన్నిటా రెండాకులు ఎక్కువ చదివిన వారు కాబట్టి మీ సృష్టికి పులుల పేర్లు పెట్టినట్టున్నారు.

మీ అవసరాలు పాపం మీకున్నాయనుకోండి. కానీ ఈ దేశంలో ఒక రాజ్యాంగం వుంది కాబట్టి, అది ఈ రకమైన హంతక ముఠాల సృష్టిని ఒప్పుకోదు కాబట్టి ఈ పులుల గొడవ హైకోర్టు దృష్టికి వచ్చింది. తీసుకుపోయిన వాళ్లు గిట్టని వాళ్లే కావచ్చు. మీ హోంమంత్రి మాధవరెడ్డికి గిట్టని వాడయిన ఆలేరు ఎంఎల్ఏ మోత్కుపల్లి నర్సింహులు, మీ పాలనకే గిట్టని వాళ్లయిన పౌరహక్కుల వాళ్లు ఈ పని చేసారు. అయినా నర్సింహులు ఏం చేస్తాడు పాపం? స్వయంగా హోంమంత్రి గారి నియోజకవర్గంలోనే బ్లాక్‌టైగర్స్ తనను ఖబడ్దార్ అంటూ బెదిరిస్తూ పోస్టర్లు గోడలకు అంటిస్తే ఏ మానవ మాత్రుడైనా ఏం చేస్తాడు? వేరే ఎవరయినా ఖబడ్దార్ అంటే హోంమంత్రికి రక్షణకోసం అర్జీ పెట్టుకుంటారు. హోంమంత్రి పెరట్లోనే ఎవరో పులులమంటూ చంపేస్తాం అని బెదిరిస్తే కోర్టుకు కాకపోతే వేరెవరికి చెప్పుకుంటాడు?

పౌరహక్కుల వాళ్లయినా అంతే. మీ గ్రీన్‌టైగర్స్ వరంగల్‌లో ఆంధ్రభూమి విలేకరిని పట్టపగలు పట్టణంలోనే కిడ్నాప్ చేసి అక్కడెక్కడో బలవంతపు ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టారు. ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం బాధ్యులందరినీ చంపేస్తామని అడ్వాన్స్‌గా చెప్పేసారు. మీరు వాళ్లకు తొందరపాటు మంచిది కాదని చెప్పడం మరచిపోయినట్టున్నారు. ఆ బెదిరింపు పేపర్లలో చదివి మేము పెద్దగా ఆందోళన చెందలేదనుకోండి. ఎందుకంటే మాకిది కొత్త కాదు. మీకు ముందు ఈ రాష్ట్రాన్ని ఏలినవారు మా గోపిరాజన్నను, మా డాక్టర్ రామనాధంను, మా జాపా లక్ష్మారెడ్డిని, మా నర్రా ప్రభాకర్ రెడ్డినీ హత్యచేసారు. మేము మరచిపోయి ఏమరుపాటులో పడిపోకుండ వుండేందుకు ( దయగల వారు కాబట్టి) అప్పుడప్పుడు మమ్మల్ని చంపుతామని మీ పోలీసులు హెచ్చరిస్తూనే వుంటారు.

అయితే భారతదేశంలో నాగరికత ఆటవిక దశను దాటి కొంచెం పురోగమించిన ప్రాంతాలు కొన్ని వున్నాయి. అన్నీ మన రాష్ట్రంలాగ లేవు. అటువంటి ఒక రాష్ట్రమయిన తమిళనాడులో పనిచేసే పౌరహక్కుల బాధ్యులు సుధా రామలింగం గారు ఆ వార్త చూసి 'ఇది ఊరా అడవా' అని ఆందోళన చెంది మన రాష్ట్ర హైకోర్టుకు ఉత్తరం రాసారు.

మన రాష్ట్ర హైకోర్టు సంగతి మీకు తెలియనిది ఏముంది? ప్రజల క్షేమం మీకూ, మీ పోలీసులకూ ఏమీ పట్టనట్టు, తనకు మాత్రమే పట్టినట్టు ఎవరు టెలిగ్రాం ఇచ్చినా, ఉత్తరం రాసినా, టెలిఫోన్ చేసి చెప్పినా రిట్‌పిటిషన్‌గా స్వీకరించి నోటీసులు జారీ చేయడం అలవరచుకుంది. ఏసి బంగ్లాలలో వుంటూ ఏసీ కార్లలో తిరిగే జడ్జీలకు మీ కష్టాలేం తెలుస్తాయి పాపం! ఎన్ని కష్టాలు లేనిదే మీరు మాత్రం ఈ కిరాయి హంతక పులులను సృష్టిస్తారు!


అయినా ఈ దేశంలో ఒక రాజ్యాంగం ఇంకా వుంది కాబట్టి, కోర్టులు జారీ చేసే నోటీసులకు ప్రభుత్వాలు జవాబు చెప్పక తప్పదు కాబట్టి, మీకు జవాబు చెప్పక తప్పలేదు. ఏప్రిల్ 6వ తేదీన సికిందరాబాద్‌లో గద్దర్‌పైన దాడిచేసిన గ్రీన్‌టైగర్స్ ఆచూకీ ఏమయినా తెలిసిందా అని హైకోర్టు మిమ్మల్ని అడిగింది. మీరు చాలా క్లుప్తంగా, చక్కగా జవాబు చెప్పారు. 'మాకేమీ తెలియడం లేదు' అని ఒక్క వాక్యంలో చెప్పారు. 'టు ది పాయింట్' అని ఇంగ్లీషులో అంటారు. జూన్ 3వ తేదీన భువనగిరిలో ఆలేరు ఎంఎల్ఏ మోత్కుపల్లి నర్సింహులునూ, ఇంకొక ఇద్దరిని హెచ్చరిస్తూ పోస్టర్లు అంటించిన బ్లాక్ టైగర్స్ సంగతేమైనా మీకు తెలిసిందా అని కూడ హైకోర్టు మిమ్మల్ని అడిగింది. మీరు దీనికి కూడ ముక్కుసూటిగా టు ది పాయింట్ జవాబు చెప్పారు. 'మాకేమీ తెలియడం లేదు' అన్నారు. మీ జవాబులోని నిజాయితీని మెచ్చుకోగలం.

కానీ నమ్మడమే కష్టంగా వుంది. మీ కష్టాలు మీకు లేకపోలేదని ఇదివరకే ఒప్పుకున్నాము. అయినప్పటికీ వున్న మాట చెప్పుకోవాలి. మీ జవాబులు నమ్మడం కష్టంగా వుంది. వాళ్లేమైనా గద్దర్‌పైన దాడిచేసిన తరువాత మస్కట్‌కో, దుబాయ్‌కో పారిపోయి వుంటే మీ అశక్తతను అర్థం చేసుకోవచ్చు. కానీ గ్రీన్‌టైగర్స్ ఎక్కడికీ పోలేదు. ఏప్రిల్ 6న గద్దర్‌పైన హత్యాప్రయత్నం చేసారు. ఏప్రిల్ 14న హైదరాబాద్‌లో ఒక ప్రకటన విడుదల చేసారు. మే 9న వరంగల్‌లో ఆంధ్రభూమి విలేకరికి ఇంటర్వ్యూ ఇచ్చారు. మే 27న మహబూబ్‌నగర్‌లో మా సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి, న్యాయవాది పురుషోత్తంపైన ఆ ఊరిలో హత్యాప్రయత్నం చేసారు. ఒక ఎన్‌కౌంటర్‌పైన మహ బూబ్‌నగర్ జిల్లా సెషన్స్ కోర్టు నిర్వహిస్తున్న విచారణలో సాక్ష్యం చెప్పడానికి పోబోతున్న అమ్రాబాద్ మండలాధ్యక్షుడు లాలూ నాయక్‌ను సాక్ష్యం చెప్తే చంపేస్తామని బెదిరిస్తూ జూన్ 26న ఉత్తరం రాసారు. ఆ జిల్లాలో కరువు సమస్య పరిష్కరించాలని ఆందోళన చేస్తున్న కరువు వ్యతిరేక పోరాట కమిటీ బాధ్యులను కూడ బెది రించారు. మీ గ్రీన్‌టైగర్స్‌కు 'క్రాంతిసేన' యోధులు మిత్రులని ఈ క్రమంలో ప్రజలకు తెలిసింది. మే 10 నాడు వరంగల్‌లో ఆంధ్రభూమి విలేకరికిచ్చిన ఇంటర్వ్యూలో ఈ సంగతి గ్రీన్‌టైగర్స్ నాయకుడు సుభాష్‌చంద్రబోస్ చెప్పారు. ఆ 'క్రాంతిసేన' యోధులు మే 30వ తేదీన వరంగల్ జిల్లాలో పసరగొండ ఐలయ్యనూ, జూన్ 1వ తేదీన కరీంనగర్ జిల్లాలో పిల్లి శేఖర్‌నూ కాల్చి చంపారు. ఇంకా చాలామందిని చంపుతామని వీరు జూన్ 8న వరంగల్‌లో పత్రికాప్రకటన ఇచ్చారు. 'ఎన్‌కౌంటర్ల'ను ఖండించే ప్రజాప్రతినిధుల మీద చర్య తీసుకుంటామని జూన్ 2న మళ్లీ వరంగల్‌లో పత్రికాముఖంగా ప్రకటించారు. అదేరోజు వారి సహోదరులయిన బ్లాక్‌టైగర్స్ నాయకుడు వంశీ అనే ఆయన మీరుండే హైదరాబాద్‌లోనే ఒక పత్రికాప్రకటన చేస్తూ పౌరహక్కుల సంఘాల వాళ్లతో సహా చాలా మందిని చంపబోతామని తెలియజేసాడు.

అంటే వీళ్లంతా ఇక్కడే ఎక్కడో వున్నారు. గద్దర్‌పైన కాల్పులు జరిపిన తరువాత మస్కట్‌కో, దుబాయ్‌కో పారిపోలేదు. బేఫికర్‌గా ఇక్కడిక్కడే వుంటూ ప్రకటనలిస్తున్నారు, పోస్టర్లు వేస్తున్నారు, భౌతిక దాడులు చేస్తున్నారు, హత్యలు చేస్తున్నారు. అయినా మీకు వీళ్ల గురించి ఏమీ తెలియడం లేదంటే హైకోర్టు సంగతేమోగానీ మేమయితే నమ్మలేకుండా వున్నాము. మీ పోలీసులు మరీ అంత అసమర్థులేం కాదు. పని చేయదలచుకోకపోతే వేరే సంగతి కానీ చేయదలచుకుంటే సమర్థులే. ఆ సంగతి మీకు మాత్రం తెలీదూ?

కాబట్టి ముఖ్యమంత్రిగారూ ఇంక బుకాయించి ప్రయోజనం లేదు. 'ది క్యాట్ ఈజ్ అవుట్ ఆఫ్ ది బ్యాగ్' అని ఇంగ్లీషులో అంటారు. ఈ రంగురంగుల పులులూ, ఈ క్రాంతిసేన యోధులూ మీ ప్రభుత్వం సృష్టే. మీరూ, మీ హోం మంత్రి మాధవరెడ్డిగారూ, మీ పోలీసు శాఖ అధికారులు దొరగారూ, అరవిందరావు గారూ సృష్టించిన హంతక మూకలే. మీ పెరట్లో రక్షణ పొందుతూ హత్యలు చేస్తున్న కిరాయి గ్యాంగులే.

మేము ప్రజల హక్కులను కాపాడడం కోసం కృషి చేస్తున్న సంస్థగా సూటిగా, క్లుప్తంగా మిమ్మల్ని ఒక్కటే అడుగుతున్నాం. ఈ కిరాయి హంతక ముఠాలను రద్దు చేయండి. అవి మఫ్టీ పోలీసు ముఠాలో, కిరాయి నేరస్తుల ముఠాలో మాకు తెలీదు. ఏదయినా ఇదొక అనాగరిక సృష్టి. అప్రజాస్వామిక సృష్టి. అడుగుతున్నామని కోపగించుకోకుండ దయచేసి వాటిని రద్దు చేయండి. ఇది అంతో యింతో నాగరికత వున్న దేశం. ఆ నాగరికత ఊరికే రాలేదు. ప్రజలు, ఉద్యమకారులు, మేధావులు ఎంతో కృషి చేసి ఎన్నో త్యాగాలు చేసి ఈ మాత్రం నాగరికతను సాధించారు. నిలబెట్టారు. మీ తాత్కాలిక ప్రయోజనాల కోసం దానిని నాశనం చేయొద్దు. నాగరికతను గౌరవించడం తెలియని పోలీస్ అధికార్ల సలహాలు విని దానిని ధ్వంసం చేయొద్దు.




మీ కష్టాలంటారా? మాకు తెలుసని ముందే చెప్పాము కదా. నిజమే, కోర్టులు ఈ మధ్య ఉచ్చనీచాలు తెలియకుండ ఆర్డర్లు జారీ చేస్తున్నాయి. ఎన్‌కౌంటర్లన్నీ పోలీసు హత్యలే అని పౌరహక్కుల వాళ్లు, ప్రజా ఉద్యమకారులూ అంటూ

వుంటే అదేదో నినాదం లెమ్మని మీరనుకుంటుంటే అది నినాదం కాదనీ అదే చట్టమనీ 1995లో రాష్ట్ర హైకోర్టు అనింది. మధుసూదన రాజు ఎన్‌కౌంటర్‌పైన సిబిఐ చేత పరిశోధన జరిపించ మనింది. 1996 నవంబర్‌లో జాతీయ మానవ హక్కుల కమిషన్ తగుదు నమ్మా అని ఆమాటే తానూ అనింది. మెదక్, మహబూబ్ నగర్, వరంగల్, కరీంనగర్ జిల్లాలలో జరిగిన అయిదు ఎన్‌కౌంటర్‌లపైన సిబిసిఐడిచేత పరిశోధన జరిపించమనింది. ఈ సంవత్సరం మెదక్, నల్గొండ జిల్లాలలో జరిగిన అనేక ఎన్‌కౌంటర్లలో హైకోర్టు మృతదేహాలను ఫోరెన్సిక్ నిపుణుల చేత రెండవసారి పోస్ట్‌మార్టం జరిపించింది. మెదక్ జిల్లా లక్ష్మాపూర్ ఎన్‌కౌంటర్ ఘటనలో రెండవ శవపరీక్ష నివేదికను పరిశీలించినాక పోలీసుల పైన హత్య కేసు పెట్టాలని ఆదేశించింది.

ఇది మాకు తెలియంది కాదు. ఈ అర్డర్లు, తీర్పులు సాధించ గలిగామనే కదా మీకూ మీ పోలీసులకు ప్రజాగాయకుడు గద్దర్‌పైనా పౌరహక్కుల సంఘం పైనా ఇంత కోపం వచ్చింది? లేకపోతే గద్దర్‌పైనా, మా పైనా వేరే ఎవరికి కోపం ఉంటుంది? ఎందుకుంటుంది?

అయితే ఈ ఆర్డర్లూ, ఈ తీర్పులూ, ఈ ఆందోళనలూ, ఈ ఉద్యమాలూ మనం గర్వంగా చెప్పుకునే ప్రజాస్వామ్యంలో భాగమే. ఆ ప్రజాస్వామ్యాన్ని సాధించుకున్నందుకు మనల్ని మనం మెచ్చుకుంటూ స్వాతంత్ర్య స్వర్ణోత్సవాలు కూడ జరుపుకుంటున్నాం. సరిగ్గా ఇదే సమయంలో మీరు ఈ పులులను సృష్టించడం బాగులేదు. ప్రజాస్వామ్యమంటే గౌరవం లేకపోయినా కనీసం ఔచిత్యమైనా పాటించవలసింది. మరీ ఇంత బరితెగించిపోతే అందరూ నవ్విపోతారు. ఈ దేశపౌరులు మీ చర్యలను చూసి నవ్వినా ఏడ్చినా మీకు పెద్దగా పట్టదనుకోండి. మీరు ఆ మేరకు స్థితప్రజ్ఞులని మాకు తెలుసు. కానీ తెల్లవాడు సహితం నవ్విపోతున్నాడు. పాశ్చాత్యదేశాల ప్రజాతంత్రవాదులు, ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ వంటి అంతర్జాతీయ పౌరహక్కుల సంస్థ సభ్యులూ ఇప్పటికే గద్దర్‌పైన జరిగిన దాడి గురించి, మా పురుషోత్తంపైన జరిగిన దాడి గురించి మీకు పుంఖానుపుంఖాలుగా నిరసన లేఖలు రాసి వున్నారు. మీ సెక్రెటరీగారు మీకు ఈ సంగతి చెప్పే వుంటారు. ఇదంతా బిల్‌గేట్స్‌కు తెలిస్తే ఏమనుకుంటాడు చెప్పండి! వారి దయ పోగొట్టుకుంటే మన రాష్ట్రం ఎప్పటికైనా ఒక 'ఏషియన్ టైగర్' అయ్యేనా!

ఏమన్నారూ? రాష్ట్రాన్ని 'ఏషియన్ టైగర్' చేయడం కోసమే ఈ 'గ్రీన్ టైగర్'లనూ, 'బ్లాక్ టైగర్'లనూ సృష్టించానంటున్నారా? ఆ సంగతి మేము ఎప్పుడో ఊహించాము లెండి. ఏషియన్ టైగర్లుగా పేరుపొందిన దక్షిణ కొరియా, తైవాన్, థాయిలాండ్, మలేషియా వంటి దేశాలలోని పౌరహక్కుల పరిస్థితి మన దేశం కన్నా కడుహీనంగా వున్న సంగతి మాకు తెలియనిది కాదు. ఆ దేశాలు శరవేగంగా సాధించిన ఆర్థిక 'ప్రగతి' ఈ పౌరహక్కుల లేమిపైన, అణచివేత పైన ఆధారపడిందని కూడ మేము ఎరుగుదుము. అందుకే ఆ దేశాలంటే మీకింత అభిమానం అని సహితం మా కెరుకే. ఈ కార్మిక సంఘాలూ, ఈ రిట్‌పిటిషన్లూ, ఈ ఉద్యమాలూ, పౌరహక్కులూ ఇవేవీ లేకుండా వుంటే రాష్ట్రం ఎంత వేగంగా అభివృద్ధి చెంది వుండేదో అని ( అంటే మీరూ, మీవారూ కోటీశ్వరులు అయి వుండేవారని) మీరు ఆవేదన చెందుతున్నారని మాకు తెలుసు. అయితే ఒక్కసారిగా మీరొక ఆదేశం జారీ చేసి ఈ ప్రజలు సాధించుకున్న హక్కులన్నిటినీ భస్మం చేయలేరు కాబట్టి అదే కార్యం ఇంకొక రకంగా సాధించడం కోసం ఈ రంగురంగుల పులుల సృష్టికి మీరు పూనుకున్నారని కూడ మాకు తెలుసు.

విశాల హృదయంగల వాళ్లము కాబట్టి మేము అర్థం చేసుకోగలము. కానీ ఒప్పుకోలేము. ఊరకుండలేము. మీరు ప్రతిపాదించే 'అభివృద్ధి' కావాలా లేకపోతే పౌరహక్కులు, ప్రజాస్వామ్యం కావాలా అంటే అది ఒద్దు ఇదే కావాలంటాం. అంటే 'అభివృద్ధి' వద్దని కాదు. ప్రజాస్వామ్యయుతమైన అభివృద్ధి కావాలని. అందరికీ అందే అభివృద్ధి కావాలని. అది పొందాలంటే పౌరహక్కులు వుండాలని.

అందుకే అడుగుతున్నాం - ఈ పులులనూ, క్రాంతిసేనను రద్దుచేయండి. వాటిపేరు మీద హత్యలకూ, దాడులకూ, బెదిరింపులకూ పాల్పడుతున్న వారిని అరెస్టు చేయండి. ఈ కిరాయి హంతక మూకల సృష్టికి మూలపురుషులయిన పోలీస్ అధికారులను ఉద్యోగాల నుండి తొలగించండి ( కావాలంటే గూండా గ్యాంగులు పెట్టుకోమనండి).

త్వరలో ఈ పనులు మీరు చేయకపోతే మీ పాలనను దేశీయంగా, అంతర్దేశీయంగా భ్రష్టు పట్టించడానికి మేము చేయగలిగిందంతా చేస్తాం. ఆ పని మేము బాగా చేయగలమని మీకు, మీ దొరగారికీ, మీ అరవిందరావు గారికీ తెలుసుననుకుంటాము.

సెలవు.

ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం

**(APCLC)**